"ఏంటో...నువ్వు సిల్లీ ఫెలోవని అనుకున్నానుగానీ....నువ్వు సామాన్యుడివి కావయ్యోవ్...గొప్ప కిష్కికిలాడివి" అన్నాడు.

"ఎందుకు సార్ అలా అంటున్నారు. నేనేదో కంపెనీ క్యాష్ కొట్టేసిన వాడి నైనట్టు"

"కంపెనీ క్యాష్ కొట్టడం ఏముందయ్యా......డస్కుఢమాల్‌గాడయినా చెయ్యగలడు... నీలాగా ఎవరయినా చెయ్యగలరా?"

"నేనేం చేశాను సార్?" అయోమయంగా అడిగాడు బుచ్చిబాబు.

"అబ్బ.....ఎంత అమాయకుడిలా ఫోజ్ కొడ్తావోయ్ ....యిదిగో ఈ లెటరు హెడ్డాఫీసునుంచి ఇప్పుడే వచ్చింది. ఇది నీకు తెలియకుండానే వచ్చిందటావా?" అంటూ ఆ లెటర్ బుచ్చిబాబు చేతికి ఇచ్చాడు ఏకాంబరం.

బుచ్చిబాబు ఆ కాగితాన్ని చూశాడు. అది హెడ్డాఫీసు ఆర్డర్. బుచ్చిబాబుని హైదరాబాదునుండి విజయవాడకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ..... "కెవ్!" సంతోషంతో గట్టిగా అరిచాడు బుచ్చిబాబు.

ఆ అరుపుకి ఏకాంబరం ఉలిక్కిపడ్డాడు. "అబ్బ....ఎంత చేటున అరిచావయ్యా బాబూ ....ఉలిక్కిపడి చచ్చా.... నీటంగూ టస్కు మండ" కోటు ముందుకు లాక్కుని "ధూ....ధూ..." అని ఛాతీమీద అనుకున్నాడు ఏకాంబరం .

0 0 0

"హవ్వ....హవ్వ....హవ్వ" నోటిమీద కొట్టుకున్నాడు పర్వతాలరావు.

"హమ్మో.....హమ్మో.....హమ్మో...."గుండెలమీద బాదుకుంది పార్వతమ్మ .

"రామ...రామ....రామ" నొసలుమీద బాధగా కొట్టుకున్నాడు మనసులో మాత్రం సంతోషిస్తూ బుచ్చిబాబు.

"అసలు ఏ వెధవరా నిన్ను ట్రాన్స్‌ఫర్ చేసింది?" అన్నాడు పర్వతాలరావు.

"ఏమో నాన్నా...హెడ్డాఫీసులో ఎవడో తలమాసిన వెధవ ఈ సిల్లీ పని చేసినట్లు వున్నాడు".

"మొన్నీ మధ్యనే కదరా అబ్బాయ్ నీకు ట్రాన్స్‌ఫర్ అయితే కాన్సిల్ చేసారు....మళ్ళీ చేసారేం?" అడిగింది పార్వతమ్మ.

"చెప్పాను కదమ్మా హెడ్డాఫీసులో ఎవడో తలమాసిన వెధవ ఉన్నాడని....ఇది వాడిపనే"

"వాడు కేవలం తలమాసిన వెధవే కాదురా....తల తుప్పట్టిన వెధవ! అయినా పోయినసారి ప్రయత్నించి ట్రాన్స్‌ఫర్ ఆపుకున్నావు కదా....ఈ సారి మళ్ళీ ఏ వెధవనో పట్టుకుని ట్రాన్స్‌ఫర్ ఆపుకునే ప్రయత్నం చెయ్యరాదూ?" అన్నాడు పర్వతాలరావు.

"లాభం లేదు నాన్నా..... మా వాళ్ళు ఒట్టి సిల్లీఫెలోల్లా వున్నారు. నామాట ఒక్కళ్లు కూడా వినేలాలేరు. కొన్నాళ్ళు విజయవాడ వెళ్లి పని చెయ్యి తర్వాత మళ్ళీ హైదరాబాద్ వద్దువుగానీ అన్నాడు మా బాస్".

"మీ బాస్ పనికిమాలిన వెధవలా వున్నాడు"

"అబ్బాయ్ విజయవాడ వెళ్ళిపోతే ఎలాగండీ....పోనీ ఓ పని చేద్దామా? మనం ఈ ఇంటిని అద్దెకి ఇచ్చేసి అబ్బాయితోపాటు పోదామా?" అంది పార్వతమ్మ.

తల్లి మాట వినగానే బుచ్చిబాబు గుండెల్లో గాభరాపుట్టింది.

"మీరా? నాతోనా? వస్తారా? హవ్వ హవ్వ.....హవ్వ.......నేనైతే ట్రాన్స్‌ఫర్ అయి చచ్చినట్టు విజయవాడ వెళుతున్నా...మీకేం ఖర్మ పట్టింది విజయవాడ రావడానికి?" భయం భయంగా తలిదండ్రులవైపు చూస్తూ అన్నాడు బుచ్చిబాబు.

"అదేంట్రా...ఖర్మ పట్టడం ఏంటీ? అందరం చక్కగా కలసి వుంటాం కదండీ!" భర్తవంక చూస్తూ అంది పార్వతమ్మ.

బుచ్చిబాబు మొహం పాలిపోయింది. అతనిలో టెన్షన్ మొదలయింది. తను పడిన శ్రమంతా వృధా అయ్యేలా వుంది. తండ్రి ఏమంటాడోనని ఆందోళనగా ఆయనవంక చూసాడు బుచ్చిబాబు.

## 12

బుచ్చిబాబు పని చేసే అఫీసు.

మీటింగు హాల్....

సమయం సాయంత్రం ఆరుగంటలు.

ఆ మీటింగుహాల్‌లో బుచ్చిబాబుకి విజయవాడకి ట్రాన్స్‌ఫర్ అయిన సందర్భగా ఫేర్‌వెల్ పార్టీ జరుగుతోంది. అందరూ బుచ్చిబాబు గురించి తలా అయిదేసి నిమిషాల చొప్పున మాట్లాడారు. ఆఖరున ఏకాంబరం బుచ్చిబాబు గురించి మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

అయిదు నిముషాలు గడిచాయి. ఏకాంబరం ఏదేదో మాట్లాడుతునే వున్నాడు. అది ఫేర్‌వెల్ పార్టీలో ప్రసంగం కాబట్టి ఆయన బుచ్చిబాబుని పొగుడుతున్నాడని అక్కడివాళ్ళు అనుకున్నారుగానీ లేక పోతే అతను బుచ్చిబాబును తిడుతున్నాడో, పొగుడుతున్నాడో వాళ్ళకే తెలిసేది కాదు.

ఏకాంబరం ఏకధాటిగా మాట్లాడసాగాడు.

"....మరి ఆఫీసులో పని విషయానికొస్తేనో? బుచ్చిబాబు లింగులిటాకి! అలాగే అతను ఏదయినా డ్రాఫ్టింగ్‌చేస్తే డింగుటికా! ఆ విధంగా అతన్ని హోల్ మొత్తంగా చూస్తే టింగి పింగాణీ! బుచ్చిబాబు విజయవాడలో మరింత లింగులిస్కులా పనిచేసి మంచిపేరు తెచ్చుకుంటాడని ఆశిద్దాం! అయ్ విష్ హిమ్ అల్ సక్సెస్" అంటూ కూర్చున్నాడు.

అందరూ చప్పట్లు కొట్టారు. ఆ తర్వాత బుచ్చిబాబుకి ఓ మొమెంటో యిచ్చారు. దాని తర్వాత స్టాఫ్ స్నాక్స్ తిని కాఫీ తాగారు. అందరూ బుచ్చిబాబుకి బెస్ట్‌విషెస్ చెప్పారు.

అందరి దగ్గరా శలవు తీసుకుని వెళ్ళిపోయే సమయంలో ఏకాంబరం బుచ్చిబాబుని తన క్యాబిన్‌లోకి తీసుకెళ్ళాడు.

"కూర్చోవోయ్!" అన్నాడు ఏకాంబరం తన ఎదురుగా వున్న కుర్చీని బుచ్చిబాబుకి చూపిస్తూ.

"అబ్బే ఫర్లేదు సార్! నేను మీ ఎదురుగా కూర్చోవడం ఏంటి సిల్లిగా! " మొహమాటాపడుతు అన్నాడు బుచ్చిబాబు .

"అలా మొహమాట పడతావేంటోయ్ టింగుతిలాణిలా... ఈ రోజు నుండి నీకు నేను బాస్‌ని కాదు. మరేం ఫర్లేదు కూర్చో కూర్చో".

బుచ్చిబాబు మెల్లగా కుర్చీ అంచుమీద కూర్చున్నాడు.

"ఏంటీ ....... నువ్విప్పుడేమైనా సస్పెన్స్ థ్రిల్లర్ లేదా హారర్ మూవీ చూస్తున్నావా మరీ అలా కుర్చీ అంచుమీద కూర్చున్నావు? హాయిగా వెనక్కి జారగిలబడి కూర్చోవయ్యా బాబూ!"

అలా కుర్చీ అంచుమీదనుండే వెనక్కి జారగిలబడి కూర్చున్నాడు బుచ్చిబాబు .

"అదేంటి? మరీ అంత ఇదిగా జారగిలబడి కూర్చోవాలా? ఇప్పుడు నువ్వు కునుకుతీసే ప్రోగ్రాం ఏదైనా వేసుకున్నావా? నువ్వో పెద్ద కిల్లారికిత్తిలా వున్నావే" విసుగ్గా మొహం పెట్టి అన్నాడు ఏకాంబరం.

బుచ్చిబాబు సర్దుకుని కూర్చుంటూ మెల్లగా అన్నాడు "సార్ ఇప్పుడు మీరు నాకు బాస్ కాదు...అలా మీరే అన్నారు"

"అవును...... ఇప్పుడు నేను కాదన్నానా?"

"అంటే....మరీ....మీరు ఏ కిల్లారికిత్తి అని తిడుతుంటేనూ?" నసిగాడు బుచ్చిబాబు.

"ఓహోహో...నిజమేకదోయ్. ఓరీ! అందుకేనోయ్ నాదంతా కస్కుబుస్కు వ్యవహారమని మా ఆవిడ అంటూంటుంది!" సిగ్గు పడుతూ అన్నాడు ఏకాంబరం .

"ఎంతైనా మీ ఆవిడ చాలా తెలివైన వారిలా ఉన్నారు సార్! ఇంతకి మీరు నన్నెందుకు రమ్మన్నారు సార్"

"ఏం లేదోయ్. నీకస్సలు ట్రాన్స్‌ఫర్ కావాలనుకుంటే ట్రాన్స్‌ఫర్ వద్దనుకుంటే ట్రాన్స్‌ఫర్ కాన్సిల్ ఎలా సాధ్యం అవుతుంది?"

బుచ్చిబాబు ఏకాంబరం వంక సందేహంగా చూశాడు.

"మరేం ఫర్లేదులేవోయ్. నేనెవరికి చెప్పనులే చాలా పవర్‌ఫుల్ రికమెండేషన్ పెట్టించి ఉంటావ్....కదూ?" కుతుహలంగా అడిగాడు ఏకాంబరం.

"అవును సార్"

"*నీకు అంతగా సహాయం చేస్తున్న* ఆ డింగాల డిప్పిగాడెవడు?"

"మినిస్టర్ మిన్నారావ్ సార్!" చెప్పాడు బుచ్చిబాబు.

"ఏంటీ? మినిస్టర్ మిన్నారావా? ఈ మధ్యన అతను మా కాలనీలో ఎండు చేపల షాపు ఓపెనింగ్ చేశాడయ్యా"

"అవును సార్. అతనే! సిల్లీగా ఏ షాపు ఓపెనింగ్ అంటే ఆ షాపు ఓపెనింగ్‌కి వెళ్తాడు".

"నీకంతగా సహాయపడ్డున్నాడాంటే మీకు బంధువో , మీ ఫ్యామిలీ ఫ్రెండో అయి వుంటాడు కదూ?"

"కాదు సార్. అతను నాకేమీ కాడు, అప్పుడు డబ్బులు ఇచ్చి ట్రాన్స్ఫర్ ఆపు చేయించుకున్నా!"

"అయితే మళ్ళీ డబ్బులిచ్చి ట్రాన్స్ఫర్ చేయించుకున్నావా?"

"కాదు సార్"

"మరెలా చేయించుకున్నావ్?"

బుచ్చిబాబు బుర్ర గోక్కున్నాడు "చెప్పు బుచ్చిబాబు ... ప్లీజ్ ... నా లంబాల టింబివి కదూ!" బ్రతిమిలాడుతూ అడిగాడు ఏకాంబరం.

"అయినా నేను ఎలా చేయించుకున్నానో తెలుసుకుంటే మీకేం లాభం సార్"

"లాభం వుంది బుచ్చిబాబు! నేను కూడా ట్రాన్స్ఫర్ చేయించుకుంటా"

"మీరా? ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగాడు బుచ్చిబాబు .

"గుంటూరుకి! అది మా సొంత ఊరు. ఇక్కడి నుండి మా సొంత ఊరికి వెయ్యమని హెడ్డాఫీసులో ప్రతి కిలారికిత్తిగాడిని ఎంతో ప్రాధేయపడుతూ సంవత్సరం పాటుగా అడుగుతునే వున్నాను. కానీ ఏ డస్కుఢమాల్గాడూ నాకు సహాయం చెయ్యడంలేదు...నువ్వు విజయవాడకి ఎలా ట్రాన్స్ఫర్ చేయించుకున్నావో చెప్తే నేనూ అదే రూట్లో వెళ్ళి గుంటూరు ట్రాన్స్ఫర్ చేయించుకుంటాను!! ప్లీజ్ బుచ్చిబాబు ........ నాకీ సహాయం చెయ్యి" ప్రాధేయపడుతూ అన్నాడు ఏకాంబరం.

బుచ్చిబాబు ఇబ్బందిగా మొహం పెట్టాడు.

"ఏం బుచ్చిబాబు ? నాకు సహాయం చెయ్యడం నీకిష్టం లేదా?" అడిగాడు ఏకాంబరం బాధగా బుచ్చిబాబు వంక చూస్తూ.

"సరే సార్! మీకు వివరాలేమీ చెప్పను గానీ నేను ఎలా చెపితే అలా చెయ్యండి.....మీకు ట్రాన్స్ఫర్ అవుతుంది" అన్నాడు బుచ్చిబాబు.

"చెప్పు చెప్పు! నా డింగాలడిప్పి" ఆనందంగా, ఆత్రంగా ముందుకు వంగాడు ఏకాంబరం.

0 0 0

ఆటో రివ్వుమంటూ రైల్వే స్టేషన్ వైపు దూసుకువెళ్తుంది. దాంట్లో బుచ్చిబాబు, అతనికి అటూ ఇటూ పర్వతాలరావు , పార్వతమ్మ కూర్చుని వున్నారు.

"అసలు మీరు కూడా ఇలా సిల్లీగా రైల్వేస్టేషన్కి రావడం ఏంటి నాన్నా! నాకేం

నచ్చలేదు" అన్నాడు బుచ్చిబాబు .

"అదేంట్రా బాబూ...నువ్వు ఊరుగానీ ఊరుకి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతుంటే స్టేషన్‌కి కూడా రావొద్దని అంటావ్" అంది పార్వతమ్మ.

"మనం స్టేషన్‌కి వస్తే యేం అడ్డో వెధవన్నర వెధవకి!" ధుమ ధుమ లాడుతూ అన్నాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు గతుక్కుమన్నాడు.

"నాకేం అడ్డు హి హి హి సిల్లీగా? మీరు భలే మాట్లాడతారు నాన్నా! ఏదో మీకు శ్రమనీ.....హి!" బలవంతంగా నవ్వుతూ అన్నాడు.

"చూసారా.....చూసారా...।మనబ్బాయికి మనమంటే ఎంత ప్రేమో!పాపం మనకి శ్రమ అని స్టేషనుకెందుకులే వద్దని అంటున్నాడు"సంబరంగా అంది పార్వతమ్మ .

"ఏడవలేకపోయాడు పింజారీ వెధవ! వీడిదంతా దొంగ భక్తి" అన్నాడు పర్వతాలరావు ఆటోలోంచి బయటకు చూస్తూ.

బుచ్చిబాబుకి మాత్రం యమా టెన్షన్‌గా వుంది. తనతో కూడా స్టేషన్‌కి తల్లిదండ్రులు వస్తారని అతను ఊహించలేదు. అక్కడ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం మీద నిలబడి సీత తనకోసం ఎదురుచూస్తూ వుంటుంది.

సీతను పర్వతాలరావు, పార్వతమ్మ  చూస్తే?!

కొంపలు మునిగిపోతాయ్.

ఇప్పుడెలా? ఎలా?? ఎలా???

బుచ్చిబాబు బాధగా జుట్టు పీక్కున్నాడు.

"అదేంట్రా బాబూ జుట్టు అలా పీకేస్కుంటున్నావ్?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది పార్వతమ్మ.

"అంటే దురదన్నమాట! ఆఫీసులో నా పక్కసీట్లోవాడు దొంగ బాబాలా దుబ్బు జుట్టు పెంచాడు. వాడి తలలో పేలన్నీ నాకు ఎక్కాయన్న మాట? హి హి" అన్నాడు బుచ్చిబాబు.

"అయినా ఆ అడ్డగాడిదెవడో దుబ్బుజుట్టు పెంచడం ఏంటీ..... వాడి తలలోని పేలను ఈ నిలువు గాడిద తల్లో ఎక్కించుకోవడం ఏంటీ.......హు!" అన్నాడు పర్వతాలరావు.

తండ్రి చూడకుండా మరోసారి జుట్టుని కసిగా పీక్కున్నాడు బుచ్చిబాబు.

ఆటో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ని సమీపించింది.

"ఆటో!"

గుండెలు బద్దలయ్యేలా అరిచాడు బుచ్చిబాబు. ఆటోవాడు సడేన్ బ్రేక్‌తో ఆటోని ఆపాడు.

"గేంది సార్...। ఆ అర్సుడెంది. గుండెల్ ఆగిపోయేడ్దికదా ఇస్కీ! గిట్లరిస్తే మీటర్ మీద పదీ రూపాయల ఎక్స్‌ట్రా ఇవ్వాల.... ఆ!" అన్నాడు వెనక్కి తిరిగి గీరగా చూస్తూ.

వాడి మాటను ఆ ముగ్గురూ పట్టించుకోలేదు.

"ఎందుకురా వెధవాయ్ ఈ వెధవ ఆటోని ఇక్కడే ఆపెయ్యమన్నావ్?" అడిగాడు పర్వతాలరావు.

"అదే నాన్నా... పాపం మీరు స్టేషన్‌దాక వచ్చారు కదా. మళ్ళీ లోపలికెందుకూ మీకు శ్రమ... నేను సూట్‌కేసు తీస్కుని ఇక్కడ దిగిపోయి లోపలికెళ్ళిపోతాను....మీరు ఇదే ఆటోలో ఇంటికెళ్ళిపోండి" అన్నాడు బుచ్చిబాబు.

"అదేంట్రా అలా అంటావ్.... పాపం మీ నాన్నగారు రైలు కదిలాక నీకు టాటా చెప్పి ఇంటి కెళ్ళాలని అనుకుంటుంటే!" అంది పార్వతమ్మ.

"ఆ వెధవలానే అంటాడు గాని నువ్వు ఆటోని లోపలికి పోనియ్యవోయ్" అన్నాడు పర్వతాలరావు.

ఆటో ఒక్క కుదుపుతో ముందుకు దూకింది.

"దేవా! ఈ గండం నుండి నువ్వే గట్టెక్కించాలి!" టెన్షన్‌గా ఫీలవుతూ అనుకున్నాడు బుచ్చిబాబు.

ఆటో స్టేషన్ కాంపౌండ్‌లోకి వెళ్ళి ఆగింది. ఆటోవాడికి డబ్బులిచ్చి స్టేషన్ లోపలికి అడుగుపెట్టారు ఆ ముగ్గురూ. బుచ్చిబాబు సూట్‌కేసు చేత పట్టుకుని పర్వతాలరావు. పార్వతమ్మలకు అడ్డుగా నడుస్తూ ప్లాట్ ఫాం మీద సీత కనిపిస్తుందేమోనని వేయి కళ్లతో పరిశీలిస్తున్నాడు.

"నువ్వు పక్కనైనా నడువ్ లేకపోతే వెనకాలైనా నడువ్ ఇలా కాళ్ళకి అడ్డుగా నడుస్తావేంరా వెధవయ్?" విసుక్కున్నాడు పర్వతాలరావు.

బుచ్చిబాబు తండ్రి మాటల్ని పట్టించుకోలేదు. అతని చుపులు సీతని వెతుకుతున్నాయి.

అంతలో దూరంగా సీత సూట్‌కేస్ ప్రక్కన నిలబడి ఉండడం కనిపించింది. సీత కూడా బుచ్చిబాబుని చూసింది. సీత నవ్వుతూ చెయ్యెత్తి ఊపింది.

బుచ్చిబాబు కంగారుగా మొహం తిప్పేసి వెనక్కి తిరిగి పర్వతాలరావు వంక చూసి " హి హి హి " అని నవ్వాడు.

"సడెన్‌గా నీకేమైందిరా తింగరెదవా?" కళ్లు పెద్దవి చేసి బుచ్చిబాబు వంక చూస్తూ అడిగాడు పర్వతాలరావు.

"పాపం వాడు ఊరెళ్ళిపోయే ముందు ఎందుకండీ అలా తిడ్తారు?" అంది పార్వతమ్మ .

"తిట్టక! అలా వెర్రినవ్వులు నవ్వుతాడేం వెధవ సన్నాసి"

"మరేమో... మీరు స్టేషన్ లోపలిదాకా వస్తామన్నారు వచ్చారు. ఇంక వెళ్ళిపోండి నాన్నా... అనవసరంగా మీకు శ్రమ!"

"అదేంట్రా... ఇంకా బండి రాలేదు. నువ్వింక దాంట్లోకి ఎక్కలేదు మమ్మల్ని వెళ్ళిపొమ్మంటావ్?" అంది పార్వతమ్మ.